సీరియల్

అగ్ని రహస్యం

ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

రంజిత్ అరిచిన అరుపుతో మెరుపు వేగంతో ఆ వైపుకు తిరిగింది స్టెల్లా. తిరుగుతూనే ప్రమాదాన్ని గుర్తించి రివాల్వర్‌తో ఎర్రతోడేలు తలకేసి కాల్చింది. ఆమె గురి తప్పలేదు.

ఎర్రతోడేలు కణతలోకి దూసుకుపోయింది బుల్లెట్. భీకరంగా అరుస్తూ పక్కకు పడిపోయింది.

లేచి నిలుచున్నాడు రంజిత్. కిందపడిన తుపాకీని అందుకున్నాడు. వెంటనే షాక్ నించి తేరుకోలేక పోయాడు.

స్టెల్లా తనమీదకు దూకుతున్న మరో ఎర్రతోడేలు తలమీదకు కత్తిని విసిరింది. అది తల పక్కకు తిప్పటం వల్ల చెవికి తగిలింది. కసుక్కున దాని చెవి తెగి కింద పడింది.

తుపాకీ మడమతో ఎర్రతోదేలు తలమీద శక్తికొద్దీ కొట్టాడు జాన్సన్. దాని తల రెండు చెక్కలుగా పగిలి పోయి నెత్తురు బయటకు చిమ్మింది.

భారత్‌ను వదల్లేదు ఆ ఎర్రతోదేలు. అతడి వెనుకే నోరు తెరిచి కోరల్లాంటి పళ్ళు బయటకు పెట్టి పరుగు దీసింది. అతడికి తుపాకి గురిచూసి కాల్చే అవకాశంలేదు. ఏం చెయ్యటానికి దిక్కుతోచలేదు.

ఆ పరిస్థితిని గమనించి పైలట్ డోర్ దగ్గర నుండి తుపాకి పేల్చాడుకాని అది గురి తప్పింది.

చెవి తెగిన ఎర్రతోదేలు మరింత కోపంతో షెల్లా మీదకు మళ్ళీ యెగిరిదూకింది. ఈసారి కూడా ఆ తోదేలు తెలివిగా తల పక్కకు తిప్పి కత్తివేటును తప్పించుకుం టుందని వూహించిన షెట్లా ముందుగానే కత్తిని తలకు కొంచెం పక్కగా విసిరింది.

సరిగ్గా అనుకున్నట్టే జరిగింది. ఎర్రతోదేలు తలను పక్కకు తిప్పిఁది. అంతే! షెట్లా కత్తి దాని తలను రెండుగా చీల్చేసింది.

అది అరవకుండానే కూలిపోయింది.

సరిగ్గా అదే సమయంలో అనంత్—భారత్ మీదకు దూకబోతున్న తోదేలుమీదకు తుపాకి పేల్చాడు. కాని అది గురితప్పింది.

మరోసారి కాల్చబోయి ఆగిపోయాడు. ఈసారి కాలిపే గుండు భారత్‌కు తగిలే అవకాశం వుంది. ఎర్ర తోదేలు భారత్‌కు ఎదురుగా వచ్చేసింది.

రావటంతోనే రెండు కాళ్ళనూ పైకెత్తి నోరు తెరిచి భారత్ గుండెలమీదకు దూకింది. పళ్ళతో అతడి గుండె లను చీల్చే ప్రయత్నం చేస్తున్నప్పుడే ప్రాణభయంతో

భారత్ బిగ్గరగా అరిచాడు.

ఆ అరుపు వినటంతోనే అప్పుడే కత్తి విసిరిన స్టెల్లా ఉలిక్కిపడి తలతిప్పి చూసింది. చూస్తూనే ఒక్క సెకను కూడా ఆలస్యం చెయ్యకుండా అక్కడినించే గాల్లో యెగిరి డైవ్ చేసింది భారత్ దగ్గరకు.

కత్తితో దాన్ని పొడిచే అవకాశం లేదు. కత్తి భారత్ కు కూడా తప్పక తగుల్తుంది. రివాల్వర్ పేల్చే అవకాశం కూడా లేదు. ఎగిరి దూకుతూనే యిలా ఆలోచించి— చేతిలో వున్న కత్తినీ, రివాల్వర్ను కిందికి వదిలేస్తూ రెండు చేతులతో ఎర్రతోదేలు వెనుక కాళ్ళు పట్టుకుని వెనక్కి విసురుగా లాగుతూ కింద పడిపోయింది.

స్టెల్లా అలా లాగటంతో భారత్ గుండెలను పళ్ళతో చీల్చబోతున్న ఎర్రతోదేలు నోటికి భారత్ వేసుకున్న షర్టు మాత్రమే దొరికింది.

కాళ్ళు పట్టుకుని లాగిన విసురుకు స్టెల్లా వెనుక పడిపోయింది ఎర్రతోదేలు. పడుతూనే నేలకు కొట్టిన బంతిలా లేస్తూ యెగిరి కిందపడిన స్టెల్లామీదకు దూకబోయింది.

ఎర్రతోదేలు చర్యను ముందుగానే పసిగట్టిన స్టెల్లా కిందపడుతూనే కత్తిని అందుకుని దాన్ని పైకెత్తి యెదురుగా పట్టుకుంది వెల్లకింతలా పడుకుని.

అవుట్! స్టెల్లామీదకు ఎగిరిదూకిన ఎర్రతోదేలు పొట్టలోకి నిలువుగా చివరంటా దిగిపోయింది పొడుగాటి కత్తి.

ఘోరంగా అరుస్తూ నోరు తెరిచేసింది ఆ ఎర్రతోదేలు.

• • •

అంతా నోళ్లు తెరిచి కొయ్యబారిపోయి స్టెల్లా చేసిన ఆ సాహసాన్ని చూస్తూండిపోయారు బొమ్మల్లా నిలబడి.

జీతుల ఎర్రతో దేలును అంతకంటే గొప్ప జీతుతో ఎంతో సమయస్ఫూర్తితో మాతమార్చిన స్టెల్లా తెలివి తేటలు, ధైర్యసాహసాలు వాళ్ళందరినీ ఆశ్చర్య చకితుల్ని చేశాయి.

ఎర్రతో దేలు పొట్టలోనించి కత్తిని బయటకు లాగేసింది స్టెల్లా.

కొంచెంసేపటి తర్వాత అంతా షాక్ నించి బయటపడ్డారు.

పది ఎర్రతో దేళ్ళూ భయంకరంగా చచ్చిపోయి చెల్లా చెదురుగా పడివున్నాయి.

షాక్ నించి తేరుకున్న భారత్ అక్కడ మరికొంత మంది మనుషులు వున్నారనే విషయాన్ని కూడా మరచిపోయి రివ్వున వచ్చి స్టెల్లాను కౌగలించుకుని బలంగా ఆమె పెదవుల మీద ముద్దు పెట్టుకుని ఆమెను వదిలాడు....

అతడి చర్యకు స్టెల్లా షాకయ్యింది. అతనలా చేస్తాడని ఆమె అనుకోలేదు.

"స్టెల్లా....నీ సాహసం అపూర్వం....నీ సాహసంతో యీ రోజు నువ్వు మా అందరి ప్రాణాలూ కాపాడావు" అన్నాడు భారత్.

చిరునవ్వు నవ్వింది స్టెల్లా కిందపడిన రివాల్వర్ను అందుకుంటూ—

ఒక్కొక్కరు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. చివరకు లీల—పైలట్ కూడా ధైర్యంగా కేబిన్ లోనించి

దిగివచ్చి ఆమె చూపిన తెగువకు—ధైర్యసాహసాలకు మెచ్చుకున్నారు.

చివరగా జాన్సన్ ఇలా అన్నాడు—

"ఇప్పటివరకూ ప్రాణాలకు తెగించి పోరాటానికి దిగటంలో నేనే మొనగాడినని అనుకునే వాడిని. కాని ఇప్పుడు నీ సాహసం—చొరవ—తెగింపు—వేగం చూసిన తర్వాత నీ ముందు నేనెందుకూ పనికిరానని అర్థమయ్యింది. నువ్వు వుండగా రంజిత్ మా ప్రాణాలకు తోడుగా ఉండటానికి నన్నెందుకు తీసుకువచ్చాడో తెలీటంలేదు. నువ్వు మామూలు ఆడదానివి కాదు."

ఆ మాటలతో స్టెల్లా పొంగిపోలేదు.

వాళ్ళందరి పొగడ్తలనూ చిరునవ్వుతో స్వీకరించింది.

సరిగ్గా అప్పుడే చూసింది లీల బండపక్కనే నీడలో పడివున్న కొండచిలువను.

దాన్ని చూస్తూనే "కొండచిలువ" అంటూ అరిచింది. అంతా అప్పుడు చూశారు దాన్ని.

"భయపడకండి .... అది బతికిలేదు. దాన్నికూడా స్టెల్లాయే నరికేసింది" అంటూ జాన్సన్ జరిగినదంతా వాళ్ళకు చెప్పాడు.

వాళ్ళకు స్టెల్లాను ఎలా అభినందించాలో అర్థంకాలేదు. ప్రొఫెసర్ అనంత్‌కీ, లీలకీ స్టెల్లా పక్కన ఉండగా తమకు ఎలాంటి భయమూ ఉండదనే నమ్మకం కలిగింది.

ఇక ఆ రాత్రి ఎవ్వరూ నిద్రపోలేదు.

ప్రొఫెసర్ అనంత్ సాబూజా దీవివాసులకు ఎర్ర తోడేళ్ళ మాంసం అంటే ఎంతో ఇష్టం అని చెప్పిన తర్వాత జాన్సన్ చెల్లాచెదురుగా పడివున్న ఎర్రతోడేళ్ళను ఈడ్చుకువచ్చి స్టోర్ రూంలో పడేశాడు.

గొప్ప ప్రమాదం నించి బయటపడినందుకు అంతా సంతోషపడిపోయారు. రంజిత్ కీ, భారత్ కీ స్వల్పంగా గాయాలైనాయి.

అంతా తెల్లవారటంకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. భారత్ మెదడులో తిరిగి టకారదీవి గురించిన ఆలోచనలు మొదలైనాయి.

• • •

తూర్పు తెల్లబడింది. చీకటి తెరలు తప్పుకుని సంధ్యా కాంతులు ప్రసరిస్తున్నాయి.

ఆహ్లాదకరంగా ఉంది వాతావరణం.

ఇంకా సూర్యోదయం కాలేదు.

కాబోతున్నది. సూర్యుడు పైకి రావడానికి ప్రయత్నం చేస్తున్నట్టుగా ఆకాశం ఎర్రబడబోతున్నది.

అప్పటికే అంతా సిద్ధమయ్యారు.

రాత్రి అంతగా భయపెట్టిన ఆ పరిసరాలు—ప్రకృతి వెలుగులో యెంతో రమ్యంగా కనిపించాయి. బండ పక్కనే పడివున్న కొండచిలువ చుట్టముటుకు అసహ్యంగా కనిపించింది.

తిరిగి హెలికాప్టర్ రొద పెట్టుకుంటూ పైకిలేచింది. దాని గాలికి చుట్టూ ఉన్న చెట్ల ఆకులు అటూ ఇటూ ఊగాయి. నిద్ర లేచికూడా బద్దకంగా కూర్చుని అరుస్తున్న పక్షులన్నీ ఒక్కసారి భయంతో అరుస్తూ పైకిలేచాయి.

ఎత్తుకు లేచిన తర్వాత దిశమార్చుకుని నికోలాయ్ దీవుల మీదనించి యెంతో ఉత్సాహంతో దూసుకు పోయింది హెలికాప్టర్.

అందరికీ సంతోషంగా వుంది—ఎందుకంటే ప్రమా

దంతో నిండివున్న నికోలాయ్ దీవులనించి ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా బయటపడ గలిగినందుకు.

ఐతే ఆ రాత్రి ఎదురు చూసిన అనుభవాన్ని మాత్రం వాళ్ళు ఎన్నటికీ మరువలేరు.

జరిగినదంతా ఒక్కసారి తల్చుకుంటే అప్పుడుకూడా వాళ్ళందరికీ గుండెలు దడదడమని కొట్టుకున్నాయి.

ఏమైతేనేం? తమ అదృష్టం బావుంది.

ఆలోచనల్లోనే నికోలాయ్ దీవులు దాటిపోయాయి. దాటిపోయేముందు వారికి దీవి అంతమవుతుందనగా సముద్ర తీరంనించి చెట్లవైపుకు పరుగుదీస్తున్న రెండు ఎర్ర తోడేళ్ళు—మరో మృగం కనిపించాయి.

ఆ మృగం అడవిదున్నలా వుంది. కాని దానికి కొమ్ములులేవు. బాగా ఎత్తుగా—బలిష్టంగా ఉంది.

రాత్రి అలాంటి మృగాలుకూడా తమమీద దాడి చెయ్యనందుకు వాళ్ళు సంతోషపడ్డారు. అటువంటి మృగాలు నాలుగు వచ్చినట్లయితే హెలికాప్టర్ని పిండి చేసివుండేవి.

సముద్రంమీద ఎగురుతోంది హెలికాప్టర్.

వాచీకేసి చూసుకున్నాడు ప్రొఫెసర్ అనంత్....

"మరో నలభై నిమిషాల్లో మనం సాబూజా దీవిలో ఉంటాం" అన్నాడు.

రాత్రంతా నిద్రలేకపోవడంవల్ల రంజిత్ పక్కనే కూర్చున్న జాన్సన్ కునికిపాట్లు పడుతున్నాడు. అతడి గుండుమీద రెండు చిన్న చిన్న గాట్లుపడ్డాయి. రాత్రి ఎర్రతోడేళ్ళ పోరాటంలో అవి పడివుండాలి.

"టకారదీవి ఇంతకంటే భయంకరంగా వుంటుందా?" ఉన్నట్టుండి అడిగింది లీల—సెట్లాని.

"ఉంటుంది. టకారాదీవిలో నీలిరంగు పాములు వున్నాయి. ఇలాంటి ఎర్రతోదేళ్ళు లేవుకాని పులులు ఉన్నాయి. అన్నిటినీమించి క్రూరజంతువుల్లాంటి మనుషులు ఉన్నారు."

"ఇప్పటినించే నాకు భయంగా వుంది" అన్నది లీల.

"ఆ దీవిలో మేము ఏడురోజులు గడిపాం."

"మై గాడ్!" అన్నది గుండెలమీద చెయ్యి వేసుకుని కళ్ళు పెద్దవిచేసి.

వాళ్ళలా మాట్లాడుకుంటున్నప్పుడే హెలికాప్టర్ సముద్రతీరాన్ని దాటి తిరిగి మరో దీవిలో ప్రవేశించింది.

కిందికి వొంగి పరీక్షగా చూస్తున్నాడు ప్రొఫెసర్ అనంత్.

మంచెల్లాగా నిర్మించిన ఇళ్ళనీ, పొడుగ్గా, పొట్టిగా ఆ దీవిలో అక్కడక్కడ తిరుగుతున్న మనుషులను చూస్తూనే గుర్తించాడు.

సాబూజా!

"ఇదే సాబూజా దీవి.... రెండుసార్లు రౌండ్లు కొట్టించి గూడెం మధ్యలో వున్న ఖాళీ ప్రదేశంలో లాండ్ చెయ్యి."

కొంచెం కిందికి దిగింది హెలికాప్టర్.

అప్పటికే దీవిమీద తిరుగుతున్న హెలికాప్టర్‌ని చూస్తూనే కింద తిరుగుతున్న మనుషులంతా సంతోషంతో పైకిచూస్తూ చప్పట్లు కొట్టటం మొదలుపెట్టారు.

నాగరికులు యెవరో తమ దీవిలో దిగబోతున్నారని వాళ్ళకి తెలిసిపోయింది.

మరికొన్ని నిమిషాల తర్వాత హెలికాప్టర్ గూడెం మధ్యలో ఉన్న ఖాళీప్రదేశంలో లాండయ్యింది.

అంతా ఒక్కొక్కరే బయటకు దిగారు.

అప్పటికే అక్కడ సాబూజా దీవిమనుషులంతా చేరారు. ఎక్కడినించో పరుగులాంటి నడకతో గూడెం దొర జనాన్నందరినీ నెట్టుకుంటూ అక్కడికి వచ్చాడు.

ప్రొఫెసర్ అనంత్‌ను చూస్తూ నే గుర్తుపట్టి ఆనందంతో కౌగలించుకున్నాడు. అనంత్ మిగిలిన మనుషులందరినీ వాళ్ళ భాషలో దొరకు పరిచయం చేశాడు.

సెట్లాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఒకటుంది— ఆమెకే కాదు—భారత్ కు కూడా....

అదేమిటంటే ఆ దీవిలో మనుషులు మరీ అంత మొరటుగా — భయంకరంగా లేరు. వాళ్ళలో కొంత మంది మొలకు జంతుచర్మాల్లాంటివి చుట్టుకున్నా మరి కొంతమంది మామూలు నాగరికులు ధరించే దుస్తులే వేసుకున్నారు.

అందరి చేతుల్లోనూ ఈటెల్లాంటివి లేనేలేవు.

ఇంకో విషయం ఏమిటంటే—ఆ దీవిలో మగవాళ్ళు బాగా పొట్టిగా వున్నారు. ఆడవాళ్ళు పొడుగ్గా వున్నారు.

నాగరికులు ఎప్పుడైనా ఓసారి వాళ్ళ దీవికి రావటం వల్ల అంత వింతగా అనిపించలేదు కాని నాగరిక స్త్రీలను వాళ్ళు చూడటం అదే మొదటిసారి. అంతక్రితం కొన్నిసార్లు అనంత్ ఆ దీవికి మరికొందరితో కలసి వచ్చినా లీలను తీసుకు రాలేదు.

లీలను — సెట్లాను వాళ్ళంతా వింతగా చూశారు. అక్కడి ఆడవాళ్ళను సెట్లా — లీల కూడా అలాగే చూశారు.

వాళ్ళు మొలచుట్టూ ఏదో నారతో అల్లిన బట్ట

లాంటిది చుట్టుకున్నారు. పువ్వులు, ఆకులతో చేసిన దండల్లాంటి వాటిని మెళ్ళో వేసుకుని వక్షోజాలను కప్పుకున్నారు. అంతకుమించి వాళ్ళ శరీరంమీద యెటువంటి ఆచ్ఛాదనా లేదు.

ప్రొఫెసర్ అనంత్ కి సాబూజా దీవి స్త్రీల అందచందాల గురించి తెలుసు కాబట్టి అతను మామూలుగానే ఉండిపోయాడు కాని ఆ స్త్రీలు బలమైన — బిగువైన అవయవాల పొందికను చూసి భారత్ — రంజిత్ — జాన్సన్ — పైలట్ లు గుటకలు మింగారు.

నాగరికులు తమకోసం తీసుకువచ్చిన విస్కీ సీసాలు సిగరెట్లు చూసి దొర తెగ ఆనందపడిపోయాడు. ఆ తర్వాత స్టోర్ రూంలోనించి బయటకు లాగిన ఎర్రతోడేళ్ళను చూసి దొరతోపాటు మిగిలిన వాళ్ళంతా సంతోషంతో వెర్రిగా కేకలు పెట్టారు.

ఎర్రతోడేళ్ళ శవాలచుట్టూ చేరి పిచ్చిగా ఎగురుతూ నాట్యం చేశారు. దొర కొంచెంసేపు తన్మయత్వంతో ఆ నాట్యాన్ని చూసి "ఇన్ని ఎర్రతోడేళ్ళు యెక్కడివి? వీటన్నింటినీ ఎలా చంపగలిగారు?" అనడిగాడు.

అనంత్ క్రితం రాత్రి నికోలాయ్ దీవుల్లో ఎర్రతోడేళ్ళు తమమీద దాడిచెయ్యటం గురించి వాటిని ఎలా చంపిందీ వివరంగా దొరకు చెప్పాడు.

అంతా విని ఆశ్చర్యంతో నోరు తెరిచాడు దొర. స్టెల్లా చూపిన సాహసం గురించి విన్నాక ఆమెను బాగా పొగిడాడు.

పది ఎర్రతోడేళ్ళను నాగరికులు వేటాడి తెచ్చారనే వార్త అప్పటికప్పుడే క్షణాలమీద సాబూజా దీవి అంతటికీ తెలిసిపోయింది.

ఆ వార్త వినటంతోనే స్త్రీలు—పిల్లలు పరుగులు తీసుకుంటూ అక్కడికి వచ్చేశారు. వాటిని చూస్తూనే సంతోషం పట్టలేక కొంతమంది భారత్ నీ, అనంత్ నీ కౌగలించుకున్నారు.

ఎర్రతోడేళ్ళ మాంసమంటే సాబూజా దీవి మనుషులకు యెంత ఇష్టమో ఆ సంఘటనలో, వాళ్ళ సంతోషంతో అరమైపోయింది.

నిజమే! ఎంతో రుచిగా వుండే ఎర్రతోడేలు మాంసమంటే ఆ దీవి మనుషులకు చెప్పలేనంత ఇష్టం. ఒకప్పుడు ఆ దీవిలో అక్కడక్కడ ఎర్రతోడేళ్ళు ఉండేవి. కాని వాటి మాంసంమీద వున్న ఇష్టంతో వాళ్ళంతా ఎర్రతోడేళ్ళను వేటాడి, వేటాడి చివరకు ఆ దీవిలో ఒక్క ఎర్రతోడేలు కూడా లేకుండా చేశారు. ఇప్పుడు సాబూజా దీవిలో ఎర్రతోడేళ్ళ సంతతి పూర్తిగా అంతరించిపోయింది.

వాళ్ళు ఎర్రతోడేలు మాంసం తిని ఎన్నో యేళ్ళు అయ్యింది. అందుకే ఇప్పుడు వాళ్ళకు అంత ఉత్సాహం-వెర్రి ఉద్రేకం.

దొర వాళ్ళందరినీ మంచెల్లాగా ఉన్న ఇళ్ళ దగ్గరకు తీసుకెళ్ళాడు.

ఎర్రతోడేళ్ళన్నింటినీ వాళ్ళు అక్కడినించి ఈడ్చుకు పోయారు. పిల్లలు కేరింతలు కొడుతూ వాటి వెనుకే వెళ్ళిపోయారు.

ఆ దీవి మనుషుల సంతోషాన్ని చూస్తుంటే భారత్ కి క్రితం రాత్రి నికోలాయ్ దీవుల్లో గడపకలసి రావటం ఆ ఎర్రతోడేళ్ళు దాడిచేసి అన్నీ చావటంకూడా ఒక రకంగా తమ మంచికే జరిగిందేమో అనిపించింది. ఎర్ర

తోడేలు మాంసం సాబూజా దీవి మనుషులకు ఇష్టం అని ప్రొఫెసర్ అనంత్ చెప్పినా వాళ్ళు మరీ అంత ఎక్కువగా సంతోషపడిపోతారని అనుకోలేదు.

విశాలంగా కొమ్మలుపరుచుకున్న చెట్ల వెనుగ్గా వున్న మంచెల్లాంటి ఇంట్లోకి వాళ్ళందరినీ తీసుకెళ్ళాడు దొర. అక్కడ ఏవో చెట్లకర్రలను చీల్చి అడవితీగలతో బిగించి కట్టిన పొడుగాటి ఆసనాలు ఉన్నాయి. వాటిమీద అంతా వరుసగా కూర్చున్నారు. ఎదురుగా ఉన్న ఓ చిన్న ఆసనంమీద దొర కూర్చున్నాడు.

దొర అడిగిన తర్వాత ప్రొఫెసర్ అనంత్ తామంతా సాబూజా దీవికి యెందుకు వచ్చారో అతనికి తెలియజేశాడు.

అంతా విని "టకారా దీవి ఇక్కడికి దగ్గరలోనే ఉండివుంటుందని నా ఉద్దేశం....మా పూర్వీకుల ప్రస్తావనలో కొన్నిసార్లు టకారా దీవి దొర్లింది. ఐతే మేమెప్పుడూ ఆ దీవికి వెళ్ళలేదు. ఎన్నో యేళ్ళక్రితం ఆ దీవి మనిషి ఎవడో ప్రాణాలతో నే సముద్రంలోపడి మా దీవికి కొట్టుకు వచ్చాడుట. అప్పుడు వాడు చెప్పాడుట తను టకారా దీవినించి కొట్టుకు వచ్చినట్టుగా. ఆ తర్వాత వాడ్ని మా దీవి మనుషులు ఎందువల్లనో ఈటెలతో పొడిచి చంపారు. అప్పుడే మా వాళ్ళకు టకారా దీవి గురించి మొదటిసారిగా తెలిసింది. కాని ఒకటి మాత్రం నిజం. టకారాదీవి ఇక్కడికి సమీపంలోనే వుండొచ్చు" అన్నాడు దొర.

ఆ మాటలతో భారత్ తృప్తిపడ్డాడు.

టకారా దీవి దగ్గరలో ఉందని అంటున్నాడు కాబట్టి హెలికాప్టర్ మీద తిరుగుతూ దాన్ని గుర్తించటం అంత

కష్టంకాదు. అసలు టకారా దీవి ఆ వైపునే లేనప్పుడే దాన్ని వెతకటం కష్టసాధ్యమవుతుంది.

కొంచెం సేపు కూర్చుని దొర బయటకు వెళ్ళిపోయాడు.

"నాకు ఆశ్చర్యంగా వుంది. ఈ సాబూజా దీవి మనుషులు మనందరితో ఇంత సన్నిహితంగా ఉండటం చూస్తుంటే వీళ్ళకూడా మూఢనమ్మకాలు, నాగరికులను ప్రాయశ్చిత్తం పేరుతో తలలు నరకటం లాంటివి ఏవీ ఉండవా?" అనడిగింది స్టెల్లా.

ప్రొఫెసర్ అనంత్ అందుకు నవ్వి "ఎప్పుడైనా నాగరికులు ఈ దీవికి వస్తూ ఉండటమే వీళ్ళంత సన్నిహితంగా ఉండటానికి కారణం. అయితే వీళ్ళకి మూఢ నమ్మకాలు, వింత ఆచారాలు ఉన్నాయి కాని అవన్నీ వాళ్ళవరకే పరిమితం. ఆ నమ్మకాలతో నాగరికుల ప్రాణాలు తియ్యటమనేది ఆలోచనే లేదు. అసలు నరబలులులాంటివి ఈ దీవిలోనూ, ముంకాసా దీవిలో కూడా లేవు. ముంకాసా దీవి ఈ దీవికి దగ్గర్లోనే వుంది" అన్నాడు.

వాళ్ళలా మాట్లాడుకుంటున్నప్పుడు వాళ్ళకు వెదురు గొట్టాలతో బాగా కాచిన అడవి జింకల పాలు ఇవ్వబడినాయి. వాటిలో యేవో సుగంధద్రవ్యాల లాంటివి కలిపారేమో .. ఘుమఘుమల సు వా స న లు వెదజల్లుతున్నాయి.

మిగిలినవాళ్ళు వాటిని తాగడానికి సంశయిస్తున్నప్పుడు "తాగండి....ఇవి అడవి జింకలపాలు....మనం ఇక్కడకు వస్తున్నప్పుడు కొన్ని ఇళ్ళ బయట కట్టేసి వున్న జంతువులను మీరు చూసే ఉంటారు. అవే అడవి జింకలు.

పాలకోసం వీళ్ళు వాటిని పెంచుతారు. అడవి జింకల పాలు రుచిగా ఉంటాయి. తాగిచూడండి. మీకే తెలుస్తుంది. నేను చాలాసార్లు తాగాను" అన్నాడు ప్రొఫెసర్ అనంత్....

ముందు అతను తాగటం మొదలుపెట్టిన తర్వాత మిగిలినవాళ్ళు ఆ పాలను తాగారు. నిజంగానే అవి రుచిగా ఉన్నాయి. జాన్సన్ మరో పెదురుగొట్టంతో అడవి జింక పాలను తెప్పించుకుని తాగాడు.

• • •

అప్పటికే సూర్యోదయమయ్యింది.

సూర్యుడి కిరణాలు దీవినంతటినీ ఆక్రమించుకున్నాయి.

తర్వాత చెయ్యవలసినదాన్ని గురించి భారత్ — అనంత్ మాట్లాడుకుంటున్నారు.

"మనం ఇప్పుడే బయల్దేరుదాం" అన్నాడు భారత్. అతనికి ఆత్రంగా వుంది టకారా దీవి అక్కడికి దగ్గరలోనే వుందని తెలియగానే....

"నాకేమీ అభ్యంతరంలేదు. మనిద్దరమే వెళ్ళి ముందు ఆ దీవిని లొకేట్ చేసి రావచ్చు. వీళ్ళంతా ఇక్కడే ఉంటారు. టకారా దీవిని మనం కనుగొన్న తర్వాత మన ప్లాను ప్రకారం అందరం కలిసి వెళదాం" అన్నాడు అనంత్.

అందుకు భారత్ అంగీకరించాడు.

అవును. అంతా అప్పుడే బయల్దేరవలసిన అవసరం లేదు. టకారా దీవి కనిపించిన తర్వాత ఓ ప్లాను సిద్ధం చేసుకుని అంతా కలిసి వెళ్ళొచ్చు.

దొర లోపలకు వచ్చాడు.

తను — భారత్ టకారా దీవి అన్వేషణకై హెలి

కాప్టర్‌లో అప్పుడే బయల్దేరబోతున్నట్టుగా దొరతో చెప్పాడు భారత్ ....

అందుకు దొర ఒప్పుకోలేదు.

"ఈ రోజంతా మీరు ఎక్కడికీ కదలటానికి వీల్లేదు. రాత్రంతా సరిగా నిద్రలేకుండా ఎర్ర కోడేళ్ళతో పోరాటం జరిపి అలసిపోయి వున్నారు. అందువల్ల మీరు భోజనాలుచేసి విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం మీ వినోదంకోసం 'దుసినాకా' యేర్పాటు చేయిస్తున్నాను. దయతో ఈ దొర కోరికను మన్నించండి." అన్నాడు ప్రాధేయపూర్వకంగా అరవైయేళ్ళ దొర.

దొర అన్న మాటల గురించి అనంత్—భారత్‌తో చెప్పేసరికి అతడి మొహం అదోలా అయిపోయింది. విసుగనిపించింది. యెంత త్వరగా తన పనిని ముగించుకుందామా అనే తొందరలో వున్నాడు భారత్. కాని అనుకోని విధంగా ఆలస్యం జరుగుతూనే వుంది.

"తప్పదా?" అన్నాడు అనంత్‌తో.

"తప్పదు. దొర అంత ప్రాధేయపూర్వకంగా చెప్పిన తర్వాత అతని మాట వినకపోతే బాధపడతాడు. ప్రస్తుతం దొర మనసు కష్టపెట్టటం అంత మంచిదికాదు" అన్నాడు అనంత్—దొర బాగా విశ్రాంతి తీసుకోమని ఎందుకన్నాడో అర్థం చేసుకుంటూ—

కాని—ఆ విషయం గురించి భారత్‌తో ప్రొఫెసర్ అనంత్ అప్పుడే చెప్పదల్చుకోలేదు. చీకటి పడిన తర్వాతనే చెప్పాలని అనుకున్నాడు.

"దొర 'దుసినాకా' అంటున్నాడు. అంటే ఏమిటి?" అని అడిగింది షెల్లా—అనంత్‌ని.

"దుసినాకా అంటే ఓ జంతువుతో ఇద్దరు మనుషులు

పోరాడటం. చివరకు వాళ్ళిద్దరు ఆ జంతువును చంపు తారు. ఆ జంతువు మేకలా వుంటుంది. ఐతే పూర్తిగా తెల్లటి వర్ణంతో వుంటుంది. అది మేకవంటి సాధు జంతువు కాదు. మనుషులు ఒంటరిగా దొరికినప్పుడు కొమ్ములతో పొడిచి చంపుతుంది."

తను దునినాకా గురించి వివరించి వాళ్ళకు చెబుతు న్నట్టుగా దొరకు చెప్పాడు అనంత్.

దొర నవ్వి "వీళ్ళు యింతకు ముందు యెప్పుడూ ఈ దీవికి రాలేదు కదా! అన్నీ చిత్రంగా వుంటాయి. ఒక సారి వీళ్ళందరికీ మా సాబూజా దీవిని చూపించి రాకూడదూ" అన్నాడు.

అనంత్ ఆ విషయం చెప్పగానే అంతా అందుకు బాగా ఆసక్తిని చూపుతూ లేచి నిలబడ్డారు. ముఖ్యంగా జాన్సన్—రంజిత్ ఎక్కువ ఆసక్తి చూపించారు.

ఎందుకంటే కేవలం పువ్వులు—ఆకులతో వున్న దండలతో శరీరాలను కప్పుకున్న సాబూజా దీవి ఆడ వాళ్ళ వంపుసొంపులను తనివితీరా చూడవచ్చు—అని.

అంతా మంచెలాంటి యింట్లోనించి బయటకు వచ్చారు.

ఇళ్ళ మధ్య వున్న దారి అంత విశాలంగా లేదు. కొంచెం ఇరుగ్గానే వుంది. పైగా వంకర టింకరగా వుంది. అక్కడి యిళ్ళన్నీ ఒకే రకంగా వున్నాయి. ఇళ్ళ బయట నిల్చుని ముందునించి వెళుతున్న వాళ్ళందరినీ స్త్రీలు, కొంచెం వయసులో వున్న వాళ్ళు ముసిముసిగా నవ్వుతూ చూశారు.

జాన్సన్ ధైర్యంచేసి తనని చూసి నవ్వుతున్న ఓ యువతిని చూసి కన్ను గీటాడు.

పిల్లలు చెట్లకింద యేవో ఆటలు ఆడుకుంటున్నారు—దిశ మొలలతో....

వాళ్ళని చూసి లీల—స్టెల్లా నవ్వుకున్నారు.

మొదట్లో లీల రావటం తనకు యిష్టం లేకపోయినా తర్వాత స్టెల్లాకు ఆమె అంటే యిష్టం యేర్పడింది. లీల కూడా స్టెల్లాతో బాగానే కలిసిపోయింది. స్టెల్లా సాహసాన్ని చూసిన తర్వాత ఆమె తనకంటే అన్నింటిలోనూ ఎక్కువే అనే భావం లీలకు కలిగింది. అందువల్లనే స్టెల్లా అంటే గౌరవం కూడా యేర్పడింది.

వాళ్ళతోపాటుగా ఈ టెలు తీసుకుని యిద్దరు సాబూజా దీవి మనుషులు కూడా రక్షణగా వచ్చారు.

నడుస్తూ ప్రొఫెసర్ అనంత్ ఆ యిద్దరితో కబుర్లలోకి దిగిపోయాడు. ఓ నాగరికుడు తమ భాషలో తమతో మాట్లాడటం వాళ్ళకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. అంతే కాకుండా తను వెలిగించుకున్నప్పుడల్లా వాళ్ళిద్దరికీ సిగరెట్లను ఆఫర్ చేశాడు అనంత్.

ఆ దీవిలో చెట్లు మరీ అంత పొడుగూ పొట్టీ కాకుండా వున్నాయి. చెట్ల మధ్యగా అక్కడక్కడ బాగా అల్లుకున్న పొదలు, తీగెలు కనిపించాయి.

టకారా దీవిలో వున్నంత దట్టంగా ఈ దీవిలో చెట్లు లేవని అనుకుంది స్టెల్లా.

స్టెల్లా—లీలతో మాట్లాడుతూ వెళ్ళటంతో భారత్ ఆలోచనలకు అంతరాయం లేకుండాపోయింది.

అతని ఆలోచనలన్నీ ఆ మణి గురించే—

ఆ మణి దివ్యకాంతులే అతడి కళ్ళముందు కదులుతున్నాయి. ఇప్పటివరకు ఆ మణి గురించి స్టెల్లాకు రంజిత్‌కు తనకీ మాత్రమే తెలుసు.

అంతే—

టకారా దీవికి వెళ్ళిన తర్వాతైనా ఆమణి గురించి మిగిలినవాళ్ళకు చెప్పక తప్పదు.

అనంత్ యేమని అనుకుంటాడో!

ముందుగానే చెప్పనందుకు అతను నొచ్చుకోడు కదా!

తనని చీట్ చేసి తీసుకొచ్చాడని అనుకుంటాడేమో! ఏమో! ఎలాగైనా అతడిని కన్విన్స్ చెయ్యాలి.

అప్పటికి వాళ్ళంతా మంచెల్లాంటి యిళ్ళను దాటి దీవిలో చాలా దూరం వచ్చేశారు.

"ఇక్కడ ఆగిపోదాం...." అన్నాడు అనంత్ వాళ్ళతో.

సరేనన్నారు వాళ్ళు.

వాళ్ళు నిలుచున్న చోట బాగా విశాలంగా కొమ్మలు పరుచుకున్న ఓ చెట్టు వుంది. దాన్నిండా పసుపుపచ్చని పండ్లు వేల్లాడుతున్నాయి. లీల కోరికమీద వాళ్ళిద్దరు గబగబా చెట్టు యెక్కి పండ్లు కోసి కిందపడేశారు.

అంతా ఆ పండ్లను తిన్నారు.

అవి నిమ్మపండ్లలా పులుపుగా వున్నాయి. రెండు పండ్లను మించి యెవ్వరూ యెక్కువ తినలేకపోయారు.

ఎండ తీక్షణరూపం దాల్చింది.

గాలి వెచ్చగా వీస్తోంది.

చెట్టుకింద బాగా ఎత్తుగా గడ్డి పెరిగివుంది. గడ్డిలో పడివున్న పండును తీసుకోటానికి ముందుకు వంగి గడ్డిలో చేతిని వుంచిన జాన్సన్ కీచుమంటూ అరిచాడు.

అంతా ఉలిక్కిపడ్డారు.

బాధతో గబుక్కున చేతిని వెనక్కి లాక్కుంటూ

లేచి నిలబడ్డాడు. వాళ్ళిద్దరు చెట్టు దిగి కిందికి వచ్చారు.

అంతా జాన్సన్ చుట్టూ చేరారు.

జాన్సన్ బాధతో చిందులు వేస్తున్నాడు.

"ఏం జరిగింది?" అనంత్ అడిగాడు.

"ఏదో కుట్టింది"

అప్పుడంతా కిందకు చూశారు.

గుండ్రంగా బిళ్ళలా కుంకుమ రంగులో వున్న పురుగు ఒకటి గడ్డిమీద ఎగురుకుంటూ గబగబా వెళ్ళి పోతూ కనిపించింది.

ఆ పురుగును చూస్తూనే వాళ్ళిద్దరు నవ్వి గబ గబా అక్కడికి దగ్గర్లోనే వున్న యేవో తీగెల ఆకులు తెంచుకుని వచ్చి పసరు ఆ పురుగు కుట్టిన ప్రదేశంలో పిండారు. అప్పటికే ఆ ప్రదేశమంతా బాగా వుబ్బిపోయింది.

పసరు పిండిన తర్వాత వాళ్ళిద్దరు ఆ పురుగు గురించి వాళ్ళకు చెప్పారు. ఆ బిళ్ళపురుగు అడుగున తేలుకొండి లాంటిది వుంటుందిట. దానితో అది కుడుతుందని చెప్పారు. అయితే ఆ పురుగులో తేలుకొండిలో వున్నట్టుగా విషం వుండదుట.

కొంచెం సేపటి తర్వాత అంతా వెనక్కుమళ్ళారు.

• • •

మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యేసరికి అందరికీ ఎర్రతో దేళ్ళ మాంసంతోపాటు యేవో వుడికించిన కాయల గుజ్జును కూడా వడ్డించారు.

ఆ సమయానికి వాళ్ళందరికీ ఆకలి దహించి వేస్తోంది. భోజనాన్ని వడ్డించేసరికి అంతా ఎగబడ్డారు.

సాబూజా దీవి మనుషులంతా ఎర్రతోదేళ్ళ మాంసమంటే ఎందుకంత సంబరపడిపోయారో వాళ్ళకు అప్పుడు

అర్థమయ్యింది.

నిజంగా నే అద్భుతంగా వుంది ఆ మాంసం. సెల్లాకు భారత్ కీ టకారా దీవిలో తిన్న నల్లమృగాల మాంసం కంటే కూడా ఎంతో రుచిగా వున్నట్టుంది.

ఆ వుడికించిన కాయలగుజ్జు కూడా వింత రుచితో అందరికీ ఎంతగానో నచ్చింది.

జాన్సన్ సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ఆవురావురుమంటూ మొదటిసారి వడ్డించిన మాంసాన్నంతా కొన్ని నిమిషాలకే లాగించేశాడు.

దొర దగ్గరే ఉండి అందరికీ వడ్డిస్తున్నాడు. జాన్సన్ కు రెండోసారి వడ్డించారు ఎర్రతోలు మాంసాన్ని...

ప్రొఫెసర్ అనంత్ అన్నాడు "జాన్సన్.... బాగా తినగలిగిన వాళ్ళంటే దొరకు ఎంతో అభిమానం.... మనుషులకు తిండి పుష్టి బాగా వుండాలంటూ వుంటాడు దొర. ఇప్పుడు నిన్ను చూస్తుంటే దొరకు ముచ్చటగా ఉందిట—అంటున్నాడు."

జాన్సన్ దొరవైపు చూసి చిన్నగా నవ్వి తర్వాత తిండిలో మునిగిపోయాడు.

మగవాళ్ళంతా బాగానే తిన్నారుకాని, సెల్లా, లీల ఎంత రుచిగా వున్నా ఎక్కువ తినలేకపోయారు.

అనంత్ రాత్రి భోజనం గురించి దొరతో యేదో చెప్పాడు.

తర్వాత వారితో ఇలా చెప్పాడు-"రాత్రి భోజనంగా పాములను పట్టించి వండమని చెప్పాను దొరతో—పాముల వంటకం అదో రకమైన రుచితో ఉంటుంది. తప్పకుండా మీరంతా ఇష్టపడతారు."

మగవాళ్ళంతా సిగరెట్లు వెలిగించారు.

ఓ గోలమీద వాళ్లు విశ్రాంతి తీసుకోటానికి పడకలను ఏర్పాటు చేయించాడు దొర.

పడుకున్న వెంటనే అందరికీ నిద్రపట్టింది. కాని భారత్ ఒక్కడికే నిద్రపట్టలేదు.

ఆతిథ్యంకోసం, ప్రాముల వంటకాలకోసం ఈ సాబూజా దీవికి రాలేదు. ఈ దీవిలో టకారా దీవి గురించి తెలుసుకుని ఇక్కడినించి దాన్ని అన్వేషించి తర్వాత ఓ ప్లాను ప్రకారం ఆ దీవిని చేరుకోవాలని వచ్చాడు. కాని అనుకోని విధంగా ఆలస్యం జరుగుతోంది.

ఆలస్యం జరుగుతున్నకొద్దీ యెందువల్లనో అతనిలో ఆందోళన పెరిగిపోతోంది.

ఏమో! యే నిమిషంలో ఏం జరుగుతుందో యెవరు చెప్పగలరు?

సాబూజా దీవి మనుషులంతా మంచివాళ్ళేనని ప్రొఫెసర్ అనంత్ చెప్పినా భారత్ కి అంతగా నమ్మకం కుదరలేదు.

ఎందుకంటే అతిథి మర్యాదల విషయంలో యెటువంటి లోపం రానివ్వమంటూనే తమని నరకయాతనకు గురిచేసి ప్రాయశ్చిత్తం పేరుతో ఇద్దరు స్త్రీలను నిర్దాక్షిణ్యంగా తలలు నరికివేసిన టకారా దీవి ఆటవికుల గురించి అతను ఇంకా మరచిపోలేదు.

ఈ అనాగరికుల ప్రవర్తన ఎప్పుడు ఎలా వుంటుందో వూహించటానికి వీల్లేదు.

అందుకే వీలైనంత త్వరగా తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలనే యాంగ్జయిటీలో తను వున్నాడు.

తన ఆత్రుత-ఆదుర్దా మిగిలినవాళ్ళకు ఎలా వుంటుంది? అవును, వుండదు. అందుక్కారణం తమ టకారా దీవి

ప్రయాణంలోని అసలు రహస్యం వాళ్ళెవ్వరికీ తెలీదు.

అంతే—

ఆలోచనలతోనే నిద్రలోకి జారిపోయాడు భారత్.

వాళ్ళంతా తిరిగి నిద్ర లేచేసరికి సాయంత్రం ఐదు గంటలు కావస్తోంది. వాళ్ళు లేచేసరికి 'దునివాకా' ఏర్పాట్లు జరిగిపోయాయి.

వాళ్ళు నిద్రలేవటంకోసమే ఎదురుచూస్తున్న దొర అందర్నీ అక్కడినించి ఓ పక్కగా వున్న ప్రదేశానికి తీసుకువెళ్ళాడు.

అక్కడ దీవిలోకి మనుషులంతా గుమిగూడి వున్నారు. ఎదురుగా వాళ్ళ కులదేవత విగ్రహం ఒకటి ఎత్తుగా నిలుచుని వుంది. అంతా మనిషి ఆకారంలోనే వుంది కాని తల మాత్రం ఏదో జంతువు తలలా వుంది. దానికి రెండు కొమ్ములు కూడా వున్నాయి. మూతి పొడుగ్గా వుంది.

ఆ బొమ్మకేసి లీల ఆశ్చర్యంగా చూసింది.

పొడుగాటి ఆసనాలమీద దొర వాళ్ళని కూర్చో పెట్టాడు. వాళ్ళ ఎదురుగా ఖాళీ ప్రదేశం వున్నది. ఆ ప్రదేశంలో తీగలతో కట్టబడి ఉన్న తెల్లటి జంతువు నిలబడి అందరినీ బెదురుతూ చూస్తోంది. దానికి కొంచెం దూరంలో ఒంటినిండా నల్లని బూడిద పూసుకుని ఇద్దరు పొట్టి యువకులు నిలబడి వున్నారు.

దొర ఆజ్ఞ ఐన తర్వాత ఆ జంతువుకు కట్టిన తీగలను తెంచేశారు. వెంటనే అది ఎదురుగా వున్న ఆ యువకుల మీదికి దూకింది కోపంతో.... వాళ్ళు ఒడుపుగా పక్కకు తప్పుకుంటూ దాని మెడను గట్టిగా పట్టుకున్నారు. అది తలను గట్టిగా విదిలించింది. ఆ విసురుకు వాళ్ళు చెరో

వైపుగా కొంచెం దూరంలో పడిపోయారు.

వాళ్ళు లేవకముందే అది ఓ పొట్టి మనిషిమీదకు రివ్వున దూసుకుపోయింది. అది సగం దూరం వెళ్ళేసరికే పొట్టిగా ఉన్న రెండో మనిషి ఎగిరి దానిమీదకు దూకి దాన్ని కిందపడేశాడు.

కిందపడుతూనే అది కొమ్ములతో భూమిని కుమ్మి పైకిలేచి వేగంగా ఆ ఇద్దరిమీదకు వచ్చేసింది.

స్టెల్లా—లీల మిగిలిన వాళ్ళంతా ఊపిరిబిగబట్టి ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు ఆ పోరాటాన్ని.

ఉన్నట్టుండి వూహించని విధంగా ఆ జంతువు వాళ్ళ మీదికి వెళ్ళకుండా వెనక్కుతిరిగి రివ్వున స్టెల్లామీదకు బాణంలా దూసుకుని వచ్చేసింది.

అదిరిపోయింది స్టెల్లా—ఆమెతో పాటు మిగిలినవాళ్ళు కూడా కంగారుపడిపోయారు.

తలను వంచి పొడవటానికే అన్నట్టుగా అది వచ్చేసింది. స్టెల్లాకు కనీసం తప్పుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. దాన్ని కాల్చటానిక్కూడా రివాల్వర్ బయటకు తీసే వ్యవధి కూడా లేదు.

బాగా దగ్గరికి వచ్చేసింది జంతువు.

అంతా గోలగా అరుస్తున్నారు.

దొర కంగారుగా అరిచాడు.

ఆ యిద్దరు పొట్టియువకులూ దాని వెనుకే పరుగెత్తుకు వచ్చారు.

స్టెల్లా విసురుగా లేచినిల్చుబోయింది. కాని అప్పటికే అది వీలయినంత దగ్గరగా వచ్చింది కొమ్ములు విసురుతూ—

టెన్షన్—భారత్ బిగ్గరగా అరిచాడు.

ఐతే—ఎవ్వరూ ఎదురుచూడని విధంగా జాన్సన్ మెరుపులా లేచినిల్చుంటూనే యెగిరి ఆ జంతువుమీద పడుతూ దాన్ని పక్కకు నెట్టుకుపోయాడు.

అతనలా చెయ్యకుండా వున్నట్లయితే దాని కొమ్ములు స్టెల్లా గుండెలను చీల్చివుండేవి.

కింద పడిపోయి కూడా జాన్సన్ దాని గొంతును రెండు చేతులతో ఏ మాత్రం కదలటానికి వీల్లేకుండా బిగించి పట్టుకున్నాడు.

అంతా ఆనందంతో చప్పట్లు చరిచారు. సంతోషంతో కేరింతలు కొడుతూ గోలగా అరిచారు.

జాన్సన్ సాహసం—సమయానికి తగిన చురుకుదనం అందరినీ ఆకర్షించాయి.

ఆ జంతువు జాన్సన్ కబందహస్తాలనించి బయటపడలేక కాళ్ళతో కొట్టుకుంటోంది.

ఒంటినిండా బూడిద పులుముకున్న ఆ పొట్టి యువకులిద్దరూ జంతువు గొంతును గట్టిగా నొక్కుతున్న జాన్సన్‌ను వింతగా చూశారు.

రెండు నిముషాల్లోనే ఆ జంతువు గిలగిలా తన్నుకుని ప్రాణాలు వదిలింది. జాన్సన్ అప్పుడు లేచి నిలబడ్డాడు.

స్టెల్లాతోపాటు భారత్ కూడా జాన్సన్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు—ఆమెను రక్షించినందుకు.

“ఇలా జరిగినందుకు నాకు విచారంగా వున్నా స్టెల్లా ప్రాణాలను కాపాడే అవకాశం వచ్చినందుకు సంతోషపడుతున్నాను” అన్నాడు జాన్సన్.

ఆ రాత్రి విస్కీని సేవించటం పూర్తయిన తర్వాత అందరికీ భోజనాలు వడ్డించారు. దొర కూడా వాళ్ళందరితో కూర్చుని తాగాడు. స్టెల్లా విస్కీ తీసుకుంది. లీల

సుకో లేదు. అలవాటు లేదన్నది.

పాము మాంసంతో పాటుగా వాళ్ళకు చేపలు, తర యేవో సముద్ర జంతువుల కూరను వడ్డించేసరికి నంత్ తప్పించి మిగిలినవాళ్ళు ఆశ్చర్యపడ్డారు.

ఆ దీవివాళ్ళు పడవలమీద సముద్రంలోకి వెళ్ళి చేప ను ఇతర సముద్రజంతువులను అప్పుడప్పుడు పట్టి తీసుకు స్తూ వుంటారని అనంత్ వాళ్ళకు చెప్పాడు.

కొంచెం సేపటి కబుర్ల తర్వాత అందరికీ తిరిగి పడకలు ఏర్పాటు చేయబడినాయి.

జంటలుగా వున్నవాళ్ళకు ప్రత్యేకంగా వున్న ఇళ్లను కేటాయించారు.

పైలా—భారత్ ఓ యింట్లో పడుకున్నారు. కర్ర దల ఆసనాలమీద చాపల్లాంటివి పరిచారు.

• • •

ఉదయం ఆరుగంటలకే ప్రొఫెసర్ అనంత్—భారత్ హెలికాప్టర్ మీద టకారాదీవి అన్వేషణకై నాయకుడు సూచించిన దిశగా ప్రయాణమై వెళ్ళిపోయారు.

ఆ సమయాన ఇంకా సూర్యోదయంకూడా కాలేదు. కొంచెం మేఘాలు క్రమ్మినట్టుగా ఉండటంతో వాతా వరణం ఇంకా చీకటిగానే ఉన్నట్టుంది.

అనంత్ అన్నాడు—"జాగ్రత్తగా చూడండి మిష్టర్ భారత్ టకారా దీవిని మీరే గుర్తించాలి. ఎందుకంటే ఆ దీవిని నే నెప్పుడూ చూడలేదు కదా!"

తల వూపాడు భారత్.

దూరంగా సముద్ర తీరం అంతమవుతూ పచ్చని చెట్లు కనపడుతున్నాయి. వాటికేసి జాగ్రత్తగా చూశాడు భారత్.

"కేర్‌ఫుల్‌గా అబ్జర్వ్ చెయ్యండి" అన్నాడు అనంత్ హెలికాప్టర్ ఆ పచ్చని చెట్లకు దగ్గరవుతుండగా—

పచ్చని చెట్లమీదకు వచ్చేసింది హెలికాప్టర్.

వేగాన్ని కొంచెం తగ్గించాడు పైలట్.

ఏదో దీవి. భారత్ జాగ్రత్తగా చూస్తున్నాడు.

ఆ చెట్లు యేవో కొత్తగా ఉన్నాయి. ఇంతకుముందు తను టకారా దీవిలో చూసిన చెట్లు కాదు.

ఇంకొంచెం ముందుకు వెళ్ళిన తర్వాత గూడెంలాంటిది ఇళ్ళముందు ఇటూ ఇటూ తిరుగుతున్న మనుషులు కనిపించారు. ఆ గూడెం మధ్యలో ఏదో చిన్న కొండలాంటిది కనపడింది.

దాన్ని చూస్తూనే అది టకారా దీవి కాదని గ్రహించాడు భారత్ —అదే మాటను అనంత్‌తో చెప్పాడు.

అక్కడినించి ఇంకా ముందుకు వెళ్ళింది హెలికాప్టర్.

ఎవ్వరూ మాట్లాడుకోలేదు. ఇంజన్ రొద మాత్రమే వినపడుతోంది. ప్రొపెల్లర్లు తిరుగుతున్న చప్పుడు.

గంటకు పైగా తిరిగినా ఎక్కడా టకారా దీవి కనిపించలేదు. టకారా దీవే కాదు—మరే దీవీ కనిపించలేదు.

భారత్‌కు అంతులేని నిరుత్సాహమనిపించింది.

దొర టకారా దీవి సాబూజా దీవికి దగ్గరగానే వుంటుందనే చెప్పాడు. కాని తాము చాలాదూరం వచ్చేశారు. ఐనా టకారా దీవి కనిపించలేదు.

దొర సరయిన దిశను సూచించి ఉండడు.

తను అనుమానాన్ని వ్యక్తం చేశాడు భారత్.

అనంత్ పైలట్‌తో మాట్లాడాడు. (సశేషం)